సాక్షి
హనుమకొండ
9
బుధవారం । 23 । ఏప్రిల్ । 2025



సివిల్స్‌లో మెరిశారు..

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నలుగురి ఎంపిక

- తెలుగు రాష్ట్రాల మొదటి ర్యాంకర్ వరంగల్‌వాసే
- సాయి శివానికి 11వ, జయసింహారెడ్డికి 46వ ర్యాంకు
- నీరుకుళ్ల వాసి హరిప్రసాద్‌కు 255వ ర్యాంకు
- ఐపీఎస్ గోల్ కొట్టానంటున్న 855వ ర్యాంకర్ జితేందర్‌నాయక్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నలుగురు అభ్యర్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. తెలుగు రాష్ట్రాల మొదటి ర్యాంకర్ వరంగల్ నగరవాసే. వరంగల్ శివనగర్‌కు చెందిన ఇట్టబోయిన రాజ్‌కుమార్, రజిత దంపతుల కుమార్తె సాయి శివాని ఆలిండియా స్థాయిలో 11వ ర్యాంకు, రావుల జయసింహారెడ్డి 46వ ర్యాంకు సాధించి జిల్లా పేరుప్రతిష్టలను దేశస్థాయిలో నిలిపారు. - సాక్షి నెట్‌వర్క్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య



పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

- వివరాలు 10లో ▸

ఇంటర్‌లో బాలికల హవా

ఫస్టియర్‌లో 69.89% | **సెకండియర్‌లో 73.42%**

- హనుమకొండ జిల్లాలో గత ఏడాది కంటే స్వల్పంగా పెరిగిన ఉత్తీర్ణత



విద్యారణ్యపురి: ఇంటర్‌లో బాలికల హవా కొనసాగింది. హనుమకొండ జిల్లాలో ఫస్టియర్ జనరల్ పరీక్షలకు 18,397 మంది విద్యార్థులు హాజరు కాగా 12,857 మంది (69.89 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలురు 9,600 మందికి 6,084 మంది (63.38 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 8,797 మందికి 6,773 మంది (76.99 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్, సెకండియర్‌లో హనుమకొండ జిల్లా రాష్ట్రంలో ఐదో స్థానం సాధించింది. గత ఏడాది ఇంటర్ ఫస్టియర్‌లో 62.41 శాత మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈసారి 7.48 శాతం ఉత్తీర్ణత పెరిగింది.

ఫస్టియర్ ఒకేషనల్‌లో..

ఒకేషనల్ ఫస్టియర్‌లో 1,146 మంది విద్యార్థులకు 744 మంది (64.92 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురు 533 మందికి 301 మంది (56.47 శాతం), బాలికలు 613 మందికి 443 మంది (72.77 శాతం) ఉత్తీర్ణత సాధించారని హనుమకొండ డీఐఈఓ గోపాల్ తెలిపారు.

ఇంటర్ సెకండియర్ జనరల్‌లో..

ఇంటర్ సెకండియర్ జనరల్ విభాగంలో మొత్తం 17,587 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 12,912 మంది (73.42 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురు 9,047 మందికి 6,180 మంది (68.31 శాతం), బాలికలు 8,540 మందికి 6,732 మంది (78.83 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణతలో బాలుర కంటే బాలికలదే పైచేయి ఉంది. గత ఏడాదిలో 73.23 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈఏడాది కూడా 73.42 శాతం స్వల్పంగా ఉత్తీర్ణత పెరిగింది.

సెకండియర్ ఒకేషనల్‌లో..

సెకండియర్ ఒకేషనల్ కోర్సుల్లో 892 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 689 మంది ఉత్తీర్ణత (77.24 శాతం) సాధించారు. బాలురు 419 మందికి 297 మంది (70.88 శాతం), బాలికలు 473 మందికి 392 మంది ఉత్తీర్ణత (82.88 శాతం) సాధించారు.

వరంగల్ జిల్లాలోనూ బాలికల పైచేయి..

ఇంటర్ ఫలితాల్లో వరంగల్ జిల్లాలోనూ బాలికలదే పేచేయిగా ఉంది. ఇంటర్ ఫస్టియర్‌లో రాష్ట్రస్థాయిలో 19వ స్థానం , సెకండియర్‌లో 14వ స్థానంలో నిలిచింది. ఫస్టియర్‌లో జనరల్ విభాగంలో 4,967 మంది పరీక్షలకు హాజరుకాగా 2,890 మంది (58.18 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురు 1978 మందికి 851 మంది ఉత్తీర్ణత (43.02 శాతం) సాధించారు. బాలికలు 2,989 మందికి 2,039 మంది (68.22 శాతం) ఉత్తీర్ణత సాధించారని డీఐఈఓ శ్రీధర్ సుమన్ తెలిపారు.

ఒకేషనల్ ఫస్టియర్ కోర్సుల్లో..

ఇంటర్ ఫస్టియర్‌లో ఒకేషనల్‌లో 847 మందికి 478 మంది పరీక్షలకు హాజరయ్యారు. 56.43 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

సెకండియర్ జనరల్‌లో..

సెకండియర్ జనరల్‌లో 4,743 మంది పరీక్షలు రాయగా 3,292 మంది (69.41 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురు 1,866 మందికి 1.029 మంది (55.14 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 2,877 మందికి 2,263 మంది (78.66 శాతం) పాస్ అయ్యారు. బాలురకంటే బాలికలదే పైచేయి ఉంది.

సెకండియర్ ఒకేషనల్‌లో..

వరంగల్ జిల్లాలో ఇంటర్ ఒకేషనల్ కోర్సుల్లో మొత్తం 658 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందులో 417 మంది ఉత్తీర్ణత (63.37 శాతం) సాధించారు.

రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తులు

విద్యార్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చును. ఈనెల 23 నుంచి 30 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 22 నుంచి నిర్వహించనున్నట్లు ఇంటర్‌బోర్డు ప్రకటించింది. ఇంటర్ ప్రాక్టికల్స్ జూన్ 3 నుంచి 6 వరకు నిర్వహిస్తారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు ఈనెల 23 నుంచి 30 వరకు విద్యార్థులు చెల్లించాల్సి ఉంటుంది.

హనుమకొండ జిల్లాలో 10 సంవత్సరాలుగా ఇంటర్ పరీక్షల ఫలితాలు (శాతంలో)

సంవత్సరం	ఫస్టియర్	సెకండియర్
2016	48	58.58
2017	61	70.7
2018	66	64.8
2019	66	64.33
2020	67	68.77
2021	51	-
2022	74	77.2
2023	71.6	73.73
2024	62.41	73.23
2025	69.89	73.42

కాంగ్రెస్‌వి బోగస్ మాటలు

- రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- బీఆర్‌ఎస్‌లో కాంగ్రెస్ నాయకుల చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఐనవోలు: బోగస్ మాటలు చెప్పి ప్రజలను బోల్తా కొట్టించిన కాంగ్రెస్‌ను తొందరలోనే బొందపెట్టే రోజులు వస్తున్నాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జోస్యం చెప్పారు. కక్కిరాలపల్లిలో కాంగ్రెస్ నాయకులు కంజర్ల రమేశ్, బొల్లం ప్రకాశ్ ఆధ్వర్యంలో సుమారు 20 మంది మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వారికి కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాలు కేసీఆర్ విజన్‌తో రాష్ట్రాన్ని పరిపాలించారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఆగం పట్టిస్తోందని ఆరోపించారు. మోస పూరిత హామీలతో కాంగ్రెస్‌కు ఓటేశామని ప్రజలకు అర్థమైందన్నారు. హామీల అమలు కోసం పోరాటం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాల్సిన అవసరం ఉందని, రానున్నది కేసీఆర్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో కుమారస్వామి, లింగయ్య, రాజేందర్, నాగరాజు, రాజు, సాంబరాజు, సతీశ్, రమేశ్, లలిత, పూల, సుమలత, అనిత తదితరులు ఉన్నారు. పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తక్కళ్లపల్లి చందర్‌రావు, మండల కన్వీనర్ తంపుల మోహన్, ఇన్‌చార్జ్ గోపాల్‌రావు, నాయకులు సురేశ్,అల్లం సోమయ్య, దేవదాస్, కొమురయ్య పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు..

- ఒకరి దుర్మరణం
- ఉప్పల్‌లో ఘటన



రాంరెడ్డి (ఫైల్)

కమలాపూర్: రాంగ్ రూట్లో వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ ద్విచక్రవాహనదారుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మంగళవారం ఉప్పల్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రాములపల్లి (కన్నూరు)కి చెందిన వంటకాల రాంరెడ్డి (52) ద్విచక్రవాహనంపై ఉప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి వస్తున్నాడు. బస్టాండ్ వద్ద యూటర్న్ తీసుకుని వెళ్తున్న క్రమంలో ఉప్పల్‌కు రాంగ్ రూట్లో వస్తున్న ఆర్టీసీ బస్సు.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంతో సహా రాంరెడ్డి బస్సు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న సీఐ హరికృష్ణ సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతుడి కుమారుడు ప్రణయ్ ఫిర్యాదు మేరకు రేగొండ మండలానికి చెందిన బస్సు డ్రైవర్ మంతెన శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. కాగా, ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగిందని, ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారైనట్లు స్థానికులు తెలిపారు.

న్యాయం చేయాలని బంధువుల ఆందోళన..

రాంరెడ్డి మృతికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌ను కఠినంగా శిక్షించి, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. సుమారు 3 గంటలపాటు రోడ్డుకు ఇరువైపులా వాహనాల పెద్ద సంఖ్యలో నిలిచాయి. సీఐ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. చివరకు ఆర్టీసీ బస్సు యజమాని చర్చలకు అంగీకరించడంతో ఆందోళన విరమించారు.



సివిల్స్‌లో మెరిశారు..

యూపీఎస్సీ ఫలితాల్లో మనోళ్ల సత్తా..

నలుగురు ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యర్థులకు అత్యుత్తమ ర్యాంకులు



దేశ అత్యున్నత సర్వీస్ సివిల్స్‌లో మనోళ్లు మెరిశారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) మంగళవారం విడుదల చేసిన తుది ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యర్థులు అత్యుత్తమ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. వరంగల్ శివనగర్‌కు చెందిన ఇట్టబోయిన సాయి శివాని 11వ ర్యాంకు, హనుమకొండకు చెందిన రావుల జయసింహారెడ్డి 46, నీరుకుళ్లకు చెందిన పోతరాజు హరిప్రసాద్ 255, భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన గుగులోత్ జితేందర్ నాయక్ 855 ర్యాంకులు సాధించారు. దీంతో కుటుంబీకులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

నీరుకుళ్ల యువకుడు.. సివిల్స్ సాధించాడు

- తండ్రి ప్రోత్సాహంతో 255వ ర్యాంకు



హరిప్రసాద్



అమ్మానాన్నతో హరిప్రసాద్

ఆత్మకూరు: హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్లకు చెందిన పోతరాజు హరిప్రసాద్ సివిల్స్ సాధించారు. తండ్రి ప్రోత్సాహంతో యూపీఎస్సీ ఫలితాల్లో జాతీయస్థాయిలో 255 ర్యాంకు సాధించారు. కాగా, హరిప్రసాద్‌కు ఐఏఎస్ పోస్టు దక్కనుంది. హరిప్రసాద్ తండ్రి కిషన్ నల్లబెల్లి మండలం నందిగామ జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తల్లి విజయ గృహిణి. వీరు హనుమకొండలోఉంటున్నారు. హరిప్రసాద్ పాఠశాల విద్య హనుమకొండలోని ఆర్యభట్ట పాఠశాలలో కొనసాగింది. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో చదివారు. ఐఐటీ ముంబయిలో బీటెక్(ఎలక్ట్రికల్)2016లో పూర్తి చేశారు. అనంతరం జపాన్‌లోని ఓ కంపెనీలో 2017 నుంచి 2019 వరకు పనిచేశారు. అనంతరం ఇంటికి వచ్చి సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. ఇంటివద్దే చదువుకున్నారు. రెండుసార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. తాజా ఫలితాల్లో 255వ ర్యాంకు సాధించి తన కల సాకారం చేసుకున్నారు.

నాన్న ప్రోత్సాహంతో..

మా నాన్న ప్రోత్సాహంతోనే సివిల్స్ వైపు దృష్టి సారించా. ఎలాంటి కోచింగ్ లేకుండా ఇంటి వద్దే ప్రణాళికతో ప్రిపేరయ్యా. 255 ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. నాకు ఐఏఎస్ వచ్చే అవకాశం ఉంది. **- పోతరాజు హరిప్రసాద్, సివిల్స్ 255 ర్యాంకర్**

కొడుకు కలెక్టర్ కావాలనుకున్నా..

నా కొడుకును కలెక్టర్ చేయాలనే కల నెరవేరింది. సివిల్స్‌తోనే సమాజ సేవ సాధ్యం. అందులోనే తృప్తి ఉంటుంది. మా గ్రామీణ ప్రాంతం నుంచి నా కొడుకు సివిల్స్ సాధించడం గర్వంగా ఉంది. **- పోతరాజు కిషన్, హరిప్రసాద్ తండ్రి**

నెలరోజుల్లో డబుల్ ధమాకా

- మొన్న గ్రూప్ వన్, ఇప్పుడు సివిల్స్
- సత్తాచాటిన వరంగల్ వాసి
- తెలుగు రాష్ట్రాల్లో టాపర్‌గా నిలిచిన శివాని



సాయి శివాని

సాక్షి, వరంగల్: రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి సివిల్స్ ర్యాంక్‌ల్లో ఇట్టబోయిన సాయి శివాని టాపర్‌గా నిలవడంతో వరంగల్ పేరు ఒక్కసారిగా మార్మోగింది. నెల వ్యవధిలోనే ఆమె డబుల్ ధమాకా సాధించారు. రెండు ప్రభుత్వ ఉద్యోగాలు, అవి కూడా గ్రూప్–1లో రాష్ట్ర స్థాయిలో 21వ ర్యాంకు, ఇప్పుడూ సివిల్స్‌లో ఏకంగా జాతీయ స్థాయిలో 11వ ర్యాంక్ సాధించి ఔరా అనిపించారు. వరంగల్ శివనగర్ వాసవీ కాలనీలోని తమ ఇంట్లోనే చదువుకుంటూ, ఆన్‌లైన్ పాఠాలు వింటూ జాతీయస్థాయి ఘనత సాధించడం విశేషం. బీటెక్ పూర్తయిన మూడేళ్లలోనే రెండో ప్రయత్నంలో సివిల్స్ సాధించి వరంగల్‌కు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారు. తండ్రి రాజు మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తుండగా, అమ్మ రజిత గృహిణిగా ఉంటూ తమ కుమార్తె సాయి శివాని కల సాకారం కోసం వెన్నుతట్టి ప్రోత్సహించారు. వారి ప్రోద్బలం, సాయి శివాని పట్టుదలతో చదవడంతోనే ఈ ఘనత సాధ్యమైంది.



కుటుంబ సభ్యులతో సాయి శివాని

ఐదోసారి ఐఏఎస్ కొట్టాడు..

- ఇప్పటికే ఐపీఎస్ శిక్షణలో జయసింహారెడ్డి
- తాజాగా ఆల్ ఇండియా స్థాయిలో 46వ ర్యాంకు



రావుల జయసింహారెడ్డి

హన్మకొండ: హనుమకొండకు చెందిన రావుల జయసింహారెడ్డి ఐదో ప్రయత్నంలో ఐఏఎస్ ర్యాంకు సాధించాడు. గతంలో ఐపీఎస్‌కు ఎంపికైన జయసింహారెడ్డి ఈసారి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఆల్ ఇండియా స్థాయిలో 46వ ర్యాంకు సాధించారు. జయసింహారెడ్డి తండ్రి రావుల ఉమారెడ్డి వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సహ పరిశోధన సంచాలకుడిగా విధులు నిర్వహిస్తుండగా తల్లి లక్ష్మి గృహిణి. జయసింహారెడ్డి గతంలో సివిల్స్ రాయగా ఒకసారి 217, మరోసారి 104 ర్యాంకు సాధించగా ఐపీఎస్ వచ్చింది. ప్రస్తుతం నేషనల్ అకాడమీ హైదరాబాద్‌లో ఐపీఎస్ శిక్షణ పొందుతున్నారు. జయసింహారెడ్డి పాఠశాల విద్య 7వ తరగతి వరకు జగిత్యాలలో, 8 నుంచి 10 వరకు హనుమకొండ ఎస్ఆర్ ఎడ్యు స్కూల్‌లో చదివారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేశారు. హైదరాబాద్ ఐఐటీలో బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అభ్యసించారు. తర్వాత 2020 నుంచి సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. మొదటి రెండు ప్రయత్నాల్లో ప్రిలిమ్స్ వరకు వెళ్లారు. మూడో ప్రయత్నంలో ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరిచి 217వ ర్యాంకు సాధించారు. నాలుగో ప్రయత్నంలో మరింత మెరుగైన ప్రతిభ కనబరిచి 104వ ర్యాంకు సాధించారు. ఓ వైపు ఐపీఎస్ శిక్షణ పొందుతూనే ఐదో ప్రయత్నంలో 46వ ర్యాంకు సాధించి తన లక్ష్యం చేరుకున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు రావుల లక్ష్మి, ఉమారెడ్డి మాట్లాడుతూ తమ కుమారుడు ఐఏఎస్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. తనకు ఇద్దరు కుమారులని, అందులో జయసింహారెడ్డి చిన్నవాడని, పెద్ద కుమారుడు మనీష్ చంద్రారెడ్డి కాలిఫోర్నియాలో ఆపిల్ సంస్థలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సొంతంగా ప్రిపేర్..

- సివిల్స్‌లో 855 ర్యాంకు సాధించిన జితేందర్ నాయక్



గుగులోత్ జితేందర్

భూపాలపల్లి అర్బన్: సివిల్స్‌లో భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన గుగులోత్ జితేందర్ నాయక్ మెరిశారు. ఐపీఎస్ కావాలనే లక్ష్యంతో ఎలాంటి శిక్షణ లేకుండా ఇంట్లోనే చదువుకుంటూ యూపీఎస్సీ ఫలితాల్లో 855 ర్యాంకు సాధించారు. జితేందర్ తండ్రి హేమానాయక్ భూపాలపల్లి ఏరియా సింగరేణి వర్క్‌షాపులో ఉద్యోగం చేస్తున్నారు. జితేందర్ 2021లో బీటెక్ పూర్తి చేసి 2022లో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాది పాటు ఉద్యోగం చేశారు. అనంతరం 2023 నుంచి ఇంట్లోనే ఉండి సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. ఎలాంటి శిక్షణ లేకుండా సొంతంగా చదువుకున్నట్లు తెలిపారు. చిన్నప్పటి నుంచి సివిల్ సాధించాలనే లక్ష్యంతో చదువుకున్నట్లు జితేందర్ పేర్కొన్నారు.

కేజీబీవీల్లో 88.5 శాతం ఉత్తీర్ణత



ఎస్.నర్మద సాయిప్రియ సీహెచ్.దివ్య

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని 9 కేజీబీవీల్లో 339 మంది విద్యార్థినులు ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాయగా.. 300 మంది (88.5 శాతం) ఉత్తీర్ణత సాధించారని జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ సునీత తెలిపారు. ఆత్మకూరు కేజీబీవీ విద్యార్థిని ఎస్.హర్షిణి ఎంపీసీలో 1000 మార్కులకు 967 మార్కులు సాధించింది. ఐనవోలు కేజీబీవీ విద్యార్థిని ఎస్.నర్మద బైపీసీలో 1000 మార్కులకు 984 మార్కులు, సెకండియర్ ఎంపీహెచ్‌డబ్ల్యూలో బి.సాగరిక 1000 మార్కులకు 984 మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఫస్టియర్‌లో 85 శాతం ఉత్తీర్ణత ఇంటర్ ఫస్టియర్‌లో 463 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరుకాగా 384 మంది ఉత్తీర్ణత (85శాతం)సాధించారు. కమలాపూర్ కేజీబీవీ విద్యార్థిని సీహెచ్.దివ్య ఎంపీసీలో 470 మార్కులకు 466 మార్కులు, ఐనవోలు కేజీబీవీ విద్యార్థిని అశ్విని బైపీసీలో 440 మార్కులకు 431 మార్కులు సాధించారు. హసన్‌పర్తి కేజీబీవీ విద్యార్థిని జె.సాయిప్రియ ఫస్టియర్ ఎంపీహెచ్‌డబ్ల్యూలో 500 మార్కులకు 497 మార్కులు సాధించారని తెలిపారు.

కాళోజీ కళాశాల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

హసన్‌పర్తి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో చింతగట్టులోని కాళోజీ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. సీనియర్ ఇంటర్ బీపీసీ విభాగంలో సురేశ్ 993 మార్కులు, ఎస్. వైష్ణవి 991 మార్కులు, ఎంపీసీ విభాగంలో సీహెచ్. శ్రీకృతి 991 మార్కులు, జి. తేజస్వీని 991, హాసిని 989, స్ఫూర్తి 985,అనురాఘవగౌడ్ 985 మార్కులు, సాధించినట్లు చెప్పారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎస్. వంశీ 463 మార్కులు, సింధు 461, కె. అక్షిత 460 , శ్రీనిధి 460 మార్కులు, బీపీసీ విభాగంలో ఆశ్రయ 428 మార్కులు, ఆర్.మానస 421, హారిక 421మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వై.కె.ఎస్. డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, అనిల్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి,ఎం.సతీశ్‌కుమార్ అభినందించారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు

వరంగల్ క్రైం: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డిపై బెదిరింపుల హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బెదిరింపులకు పాల్పడుతూ దౌర్జన్యంగా, అక్రమంగా డబ్బులు డిమాండ్ చేస్తూ బూతులు తిడుతున్నాడని, తనతో ప్రాణహాని ఉందని వ్యాపారవేత్త కట్ట మనోజ్‌రెడ్డి భార్య ఉమాదేవి మంగళవారం సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. గతంలో ఎన్నికల సమయంలో మనోజ్‌రెడ్డి నుంచి కౌశిక్‌రెడ్డి రూ. 25 లక్షలు తీసుకున్నాడని, మరోసారి డబ్బులు కావాలని బెదిరింపులకు పాల్పడుతూ, ఫోన్‌లో బూతులు తిడుతున్నట్లు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

క్వారీ యజమానిపై ఫిర్యాదు

కమలాపూర్: మండలంలోని గుండేడు గ్రామస్తులు క్వారీ యజమాని మనోజ్‌రెడ్డిపై కమలాపూర్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. క్వారీ యజమాని మనోజ్‌రెడ్డి గ్రామ దేవాలయాల కోసం రూ.25 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చి కేవలం రూ.15 లక్షలు మాత్రమే ఇచ్చి మిగతా డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడని, ఈ విషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మనోజ్‌రెడ్డికి ఫోన్ చేయగా మనోజ్‌రెడ్డి ఎమ్మెల్యేతో అసభ్యంగా మాట్లాడి అవమానించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై స్థానిక సీఐ హరికృష్ణను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందిందని, దీనిపై విచారణ జరుపుతున్నామని తెలిపారు.


పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

- రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హన్మకొండ/వరంగల్ : ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడత లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ సచివాలయం నుంచి సీఎస్ శాంతికుమారి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ గౌతమ్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతిపై మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.ఐదు లక్షల చొప్పున నగదు అందిస్తోందని తెలిపారు. భూభారతి చట్టంపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని, ఎల్ఆర్ఎస్ రాయితీని మరోసారి పొడిగించేది లేదని స్పష్టం చేశారు. హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భూ భారతి అవగాహన సదస్సుల్లో భూమిని రీసర్వే చేయాలని ఎక్కువ మంది రైతుల అడుగుతున్నారని, పట్టణ ప్రాంతాల్లోని సాదా బైనామాలను కూడా రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారని తెలిపారు. ఇప్పటివరకు ఏడు భూభారతి అవగాహన సదస్సులు నిర్వహించామని, మిగతావి త్వరలో పూర్తి చేస్తామన్నారు. మండల స్థాయి అధికారులు ఇందిరమ్మ కమిటీల నుంచి లబ్ధిదారుల జాబితాలను తీసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారన్నారు. అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, వరంగల్‌నుంచి కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని హత్య..

- సాయిప్రకాశ్ హత్య కేసులో కానిస్టేబుల్‌తో సహా ఆరుగురి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్‌సింగ్



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్ క్రైం : తన వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడనే కారణంతోపాటు తనను గతంలో సస్పెండ్ చేయించాడనే కోపంతో సామాజిక కార్యకర్త ఛిదం సాయిప్రకాశ్‌ను హత్య చేసిన కేసులో ఓ కానిస్టేబుల్‌తో సహా ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా వెంకటాపూర్ (ఎం) పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బాషబోయిన శ్రీనివాస్ గతంలో వెంకటాపూర్ (కె) పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వరిస్తున్న క్రమంలో భూమి విషయంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన చింతం నిర్మలతో పరిచయం పెంచుకుని వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఆ విషయంపై నిర్మల భర్తతో కలిసి మృతుడు సాయి ప్రకాశ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో శ్రీనివాస్‌ను సస్పెన్షన్ చేశారు.

ఫోన్ సమాచారంతో కిడ్నాప్.. హత్య

ఈనెల 15వ తేదీన నిందితురాలు నిర్మల, ఆమె భర్తతో కలిసి మృతుడు సాయిప్రకాశ్ తన కారులో ఆస్పత్రికి వచ్చారు. ఈ విషయన్ని నిర్మల.. నిందితుడు శ్రీనివాస్‌కు ఫోన్‌లో తెలియజేయడంతో ప్రణాళిక ప్రకారం కారును వెంబడించి రాత్రి 11.30 గంటల సమయంలో గోపాల్‌పూర్‌లోని బేబిసైనిక్ స్కూల్ వద్ద కారును ఆటోతో ఢీకొట్టించాడు. అనంతరం సాయి ప్రకాశ్‌ను కారులోనే కిడ్నాప్ చేసి హసన్‌పర్తి పరిసర ప్రాంతాలకు తీసుకెళ్లి తీవ్రంగా కొట్టి శాలువతో గొంతు బిగించి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని హుస్నాబాద్ పీఎస్ పరిధిలోని జిల్లేడగడ్డ తండా గ్రామ శివారులోని ఓ బావిలో పడేశారు. అనంతరం వేలేరు మండలం మీదుగా హనుమకొండ ఏషియన్ మాల్ దగ్గర కారు నిలిపి వెళ్లారు.

నిందితుల అరెస్ట్..

ప్రధాన నిందితుడు కానిస్టేబుల్ బాషబోయిన శ్రీనివాస్‌తో పాటు ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన దేవిలిసాయి, హనుమకొండకు చెందిన అలోతు అరుణ్‌కుమార్ అలియాస్ పండు, బాదావత్ అఖిల్ నాయక్, బాదావత్ రాజు, వాజేడు వెంకటాపూర్‌కు చెందిన చింతం నిర్మలను అరెస్ట్ చేసినట్లు సీపీ తెలిపారు. నిందితుల నుంచి హత్యకు వినియోగించిన ఓ కారు, రెండు ఆటోలు, రెండు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్ ఫోన్లు, పిస్టోల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ పేర్కొన్నారు.

అధికారులకు అభినందనలు..

సామాజిక కార్యకర్త సాయి ప్రకాశ్ హత్య కేసును వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్, హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి, హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీశ్, సిబ్బందిని సీపీ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు.

‘ఎస్ఆర్’ విద్యార్థుల విజయభేరి



బండి ప్రతిష్ట వైశాలిని ఆకోజు హాసిని పశాంతిక రమ్య రాగి.శివప్రియ శ్రీనితా



రష్మిత అనుహ్య రామచరణ్ తేజస్విని వైశాలి కార్తీక స్పందన

విద్యారణ్యపురి: ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షల ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్ రెడ్డి, సంతోష్‌రెడ్డి మంగళవారం తెలిపారు.

ఇంటర్ ఫస్టియర్‌లో..

ఎంపీసీ విభాగంలో బండి ప్రతిష్ట 470 మార్కులకు 468 మార్కులు, వైశాలి 468, ఆకోజు హాసిని 468, బాసుపెల్లి పశాంతిక రమ్య 468 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో రాగి శివ ప్రియ 440మార్కులకు 438 మార్కులు, ఎ. శ్రినితా 438 మార్కులు సాధించారు. ఎంఈసీ విభాగంలో ఎం. ఉమా మహేశ్వర్ 500 మార్కులకుగాను 495, ఆయుష్మతి నయినా 495 మార్కులు సాధించారని వారు తెలిపారు.

ఇంటర్ సెకండియర్‌లో..

ఇంటర్ సెకండియర్‌లో ఎంపీసీ విభాగంలో ఇందూరి రష్మిత 1000 మార్కులకు 996 మార్కులు, కందుకూరి అనూహ్య 995, ఆర్. రామచరణ్ 995, వి. వెంకటలక్ష్మి తేజస్విని 995 మార్కులు సాధించారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తెలిపారు. ఎంపీసీ విభాగంలో 990 మార్కులకుపైగా 14మంది విద్యార్థులు సాధించారని వారు తెలిపారు. బైపీసీ విభాగంలో ఎ. వైశాలి 1000 మార్కులకు 994మార్కులు, టి. కారిక 994 మార్కులు సాధించారు. ఎంఈసీ విభాగంలో డి. సుమతికి 1000 మార్కులకు 988మార్కులు, సీఈసీ విభాగంలో టి. స్పందన 1000 మార్కులకు 986మార్కులు సాధించారు. భవిష్యత్‌లో మరింత అత్యుత్తమైన మార్కులు సాధించేలా తీర్చిదిద్దుతామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

‘సువిద్య’ విద్యార్థుల విజయకేతనం



ఎన్.ధృతి రెడ్డి ఎస్.జీవిక పి.శ్రీజ పి.షణ్ముకప్రియ ఎం.సిరిచందన బి.దేవిశ్రీ డి.ప్రీతిక

హన్మకొండ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో హనుమకొండ నక్కలగుట్టలోని సువిద్య జూనియర్ కాలేజీ ఫర్ గర్ల్స్ విజయకేతనం ఎగురవేసింది. మంగళవారం వెలువడిన ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులయ్యారని కళాశాల కరస్పాండెంట్ కె.శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు ఎ.జితేందర్ రెడ్డి, ఎస్.వెంకట్ రెడ్డి తెలిపారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో ఎన్.ధృతి రెడ్డి 467 మార్కులు, ఎస్.జీవిక 463, పి.శ్రీజ 459, బీపీసీ మొదటి సంవత్సరంలో పి.షణ్ముకప్రియ 424, ద్వితీయ సంవత్సరంలో ఎం.సిరిచందన 986, బి.దేవిశ్రీ 985, డి.ప్రీతిక 985 మార్కులు సాధించారన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ అభినందించారు.

ఇంటర్మీడియట్‌లో ‘రెజోనెన్స్’ సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న రెజోనెన్స్ విద్యాసంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి, డైరెక్టర్లు, అధ్యాపకులు

హన్మకొండ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో రెజోనెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో వరంగల్, హనుమకొండలోని రెజోనెన్స్ జూనియర్ కళాశాలలు 90 రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బీపీసీలో రాష్ట్ర ఫస్ట్ ర్యాంకుతోపాటు మొత్తం 80 రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు వివరించారు. నలుగురు విద్యార్థులు 470 మార్కులగాను 468 మార్కులతో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకుసాధించారని, 22 మంది విద్యార్థులు 470 మార్కులకు 467 మార్కులతో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు సాధించారన్నారు. 21 మంది తృతీయ ర్యాంకు, 25 మంది రాష్ట్ర స్థాయి 4వ ర్యాంకు సాధించారని తెలిపారు. ద్వితీయ సంవత్సరంలోనూ విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో జయకేతనం ఎగుర వేశారన్నారు. 21 మంది విద్యార్థులు రాష్ట్ర టాప్ మార్కులు, 995, 994, 993, 992, 991, 990తో పాటు మరిన్ని ఉత్తమ ర్యాంకులు సాధించారని వివరించారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో భూక్యా మనోజ్ కుమార్ 468, వేముల అనిక్షిత 468, గండె వర్ష 468, మంతిని సహస్ర 468 మార్కులు, ద్వితీయ సంవత్సరంలో నీలం నిక్షిత 995, బుర్ర అక్షిత 994, బీపీసీ మొదటి సంవత్సరంలో గంద్ర శ్రీజ 438, దావర్తి శ్రీనిధి 436, దర్మల శ్రీతిక 436, ద్వితీయ సంవత్సరంలో ఎం.పూజశ్రీ 992, ఆర్.ఇఖ్వార్ 992, డి.త్రిలోచన్ 992, ఎం.అస్మిత 992 మార్కులు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు. డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, సీఏఓ లెక్కల రమ్య, అకడమిక్ డీన్ గోపాలరావు, డీన్ కె.సాంబశివుడు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ‘శివాని’ విజయదుందుభి



శైజా మాధవి హర్షిణి రిషిత నవదీప్ చక్రి



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

హసన్‌పర్తి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో భీమారంలోని శివాని కళాశాల విజయదుందుభి మోగించింది. జూనియర్ ఎంపీసీ విభాగంలో కళాశాలకు చెందిన నేరేళ్ల రిషిత 468 మార్కులు, నాగుల నవదీప్ 468 మార్కులు, చక్రిక 468, ఎస్.జశ్వంత్ 467, వరుణ్ తేజా 467, శివకుమార్ 467, తేజాశ్రీ 467, పూజిత 467, సంధ్యా 467 మార్కులు సాధించినట్లు శివాని విద్యాసంస్థల కరస్పాండెంట్ స్వామి తెలిపారు. బీపీసీ విభాగంలో బానోత్ స్వాతి 435 మార్కులు, ఇంద్రజా 434 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో మేకల కార్తీక్ 484 మార్కులు సాధించాడు. సీనియర్ ఎంపీసీ విభాగంలో చీరాల శైజా 995 మార్కులు, కె. మాధవి 995, బి. మనీషా 993, నక్షత్ర 993, దివ్యశ్రీ 992, రోజా 992, పోరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి 991, జెమిని 990 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ తెలిపారు. బీపీసీ విభాగంలో హర్షిణి 993 మార్కులు, హన్సిక 992, సుష్మిత 992 మార్కులు సాధించారని కరస్పాండెంట్ స్వామి చెప్పారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ స్వామి, ప్రిన్సిపాళ్లు చంద్రమోహన్, సురేందర్‌రెడ్డి, డైరెక్టర్లు రాజు, రమేశ్, మురళీధర్, సురేశ్, సంతోశ్‌రెడ్డి అభినందించారు.

జూనియర్ ఇంటర్‌లో ‘ఇన్‌స్పైర్’కు ప్రథమ ర్యాంకు



సాయి శ్రేష్టత



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

హసన్‌పర్తి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎర్రగట్టుగుట్ట సమీపంలోని ఇన్‌స్పైర్ అకాడమీ విద్యాసంస్థకు చెందిన తీగల సాయి శ్రేష్టత జూనియర్ ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించినట్లు డైరెక్టర్ భరత్‌కుమార్ తెలిపారు. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు 468 మార్కులు సాధించిన రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే, ఎంపీసీ విభాగంలో మేర్గు అజయ్ 464, వంశీ 464, శ్రీ చరణ్ 463, సాయిప్రియా 462, సిరి చందన 460, సాయి ప్రియ 462, బైపీసీ విభాగంలో మధుప్రియ 432 మార్కులు, కీర్తిరోషి 431, సీఈసీ విభాగంలో నూతన శ్రీ 459మార్కులు, కిరణ్మయి 455 మార్కులు సాధించినట్లు చెప్పారు.ఈ సందర్భంగా సాయి శ్రేష్టతను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల పాలక వర్గ సభ్యులు రాజ్‌కుమార్,మమత, సుంకరి శ్రీరాం రెడ్డి, హరీశ్‌గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.